క్లుప్తంగా

ప్రజలకు సేవ చేయాలి

పిట్లం: మండలంలోని అధికారులు స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీపీ కవిత సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని ఆమె పేర్కొన్నారు.

విద్యార్థులకు పోటీలు

బాన్సువాడ రూరల్: శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఆడిటోరియంలో ప్రిన్సిపల్ ఇందూరి గంగాధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నృత్య, పాటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి 9న బహుమతులు అందజేస్తామని తెలిపారు. అధ్యాపకులు భాస్కర్‌రాజు, బాలరాజు, విఠల్, పురుషోత్తం, వెంకట్రావ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

11న సాహిత్య దినోత్సవం

కామారెడ్డి క్రైం : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11న సాహిత్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో మధ్యాహ్నం ఒంటిగంటలకు కవి సమ్మేళనం ఉంటుందన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనే వారు సమన్వయకర్త మనోహర్ రావు(96666 92226)ను సంప్రదించాలని సూచించారు.

10న లోక్ అదాలత్

లింగంపేట: ఎల్లారెడ్డి కోర్టులో 10న నిర్వహించనున్న నేషనల్ లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శంకర్ తెలిపారు. ప్రమాదాలు, చీటింగ్, చిట్‌ఫండ్, భూతగాదాలు, చిన్న చిన్న దొంగతనాలు, పేకాటతో పాటు వివాహ సంబంధిత కేసుల్లో రాజీ కోసం లోక్ అదాలత్‌కు హాజరు కావాలని సూచించారు. ఫిర్యాదుదారుడు, నేరస్తుడు తమ ఆధార్‌కార్డు తీసుకొని లింగంపేట పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచించారు.

కాంగ్రెస్ కార్యవర్గం ఎన్నిక

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామ కాంగ్రెస్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతనూరి సిద్ధ రాములు, ఉపాధ్యక్షుడిగా బోయిని యాదగిరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా రామగల్ల బాబు, ఉపాధ్యక్షులుగా మిద్దె లోకేశ్, క్యాస్తి దయాకర్ సలహాదారులుగా కర్రోల్ల నర్సింహారెడ్డి, వెంకన్నగారి బాగారెడ్డి, తుడుం జీవన్, రామగ్ల రమేశ్, స్వామి, అనిల్, శ్రీకాంత్, కల్యాణ్, వకం మహేశ్, బాగయ్య ఎన్నికయ్యారు.

సంబరాలు ఎందుకు?

కామారెడ్డి అర్బన్/రామారెడ్డి: ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించకుండా దశాబ్ది ఉత్సవాల పేరిట కోట్ల రూపాయలు ఖర్చు చేయడాన్ని జెడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి తప్పుపట్టారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు రూ.701.90 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.392.14 కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు.

పాఠశాలల్లో చేర్పించాలి



సాక్షి, నెట్‌వర్క్: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు టీచర్లు గురువారం వివిధ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. లింగంపేట మండలంలో నిర్వహించిన సర్వేలో ఎంఈవో రామస్వామి, కామారెడ్డి మండలం రాజంపేటలో ఎంఈవో వై.ఎల్లయ్య పాల్గొన్నారు. మూడేళ్లు నిండిన వారందరినీ అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలని రామారెడ్డి మండలం రెడ్డిపేటలో అంగన్వాడి టీచర్ పద్మ కోరారు.

ఆర్థిక సాయం చేయాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలోని అన్ని రకాల కుల వృత్తులదారుల్లోని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రూ. లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించాలని జిల్లా మేదరి సంఘం నాయకులు గురువారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్నే కిషన్, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, కోశాధికారి గంగాధర్, ప్రచార కార్యదర్శి సంజీవులు, నాయకులు పోచయ్య, ఊరే రాజు పాల్గొన్నారు.

బకాయిలు ఉండొద్దు

కామారెడ్డి అర్బన్: చెరుకు రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కామారెడ్డి చెరుకు అభివృద్ధి మండలి (సీడీసీ) చైర్మన్ ఐరేని నర్సయ్య సూచించారు. గురువారం కామారెడ్డిలో నిర్వహించిన సీడీసీ సమావేశం నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరుకు టన్నుకు రూ.4,500 మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో గాయత్రీ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు, షుగర్‌కేన్ మేనేజర్ హరిబాబు, కేన్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటరవి, సీడీసీ డైరెక్టర్లు బద్దం ప్రతాప్‌రెడ్డి, మల్లేష్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

లింగారెడ్డిపేట మోడల్ గ్రామంగా అభివృద్ధి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: రాజకీయంగా తనకు జన్మనిచ్చిన లింగారెడ్డిపేటను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రకటించారు. గురువారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేటలో నిర్వహించిన ఊరూర చెరువుల పండగ కార్యక్రమంలో భాగంగా ఆయన గంగమ్మకు బోనాలతో పాటు, సారె, చీరను సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక గ్రామాల్లోని పలు చెరువులను సీఎం కేసీఆర్ అభివృద్ధి చేశారని అన్నారు. మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, కౌన్సిలర్ భూంగారి రాము, జెడ్పీటీసీ ఉషాగౌడ్, ఎంపీపీ మాధవి, మార్కెట్ కమిటీ చైర్మన్ కాశి నారాయణ, నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ సతీష్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

పల్లెదవాఖాన ప్రారంభం..

లింగారెడ్డిపేట గ్రామంలో పల్లె దవాఖానతో పాటు ఊర చెరువులో రూ. 15 లక్షలతో నిర్మించిన బతుకమ్మ మెట్లను, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రూ. 25 లక్షలతో నిర్మించనున్న మరో కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

ఊరూరా చెరువు పండుగ

- బతుకమ్మ, బోనాలతో గ్రామాల్లో ఊరేగింపు
- ఘనంగా దశాబ్ది ఉత్సవాలు



మల్లాపూర్‌లో నిమజ్జనం చేస్తున్న బతుకమ్మలు



గున్కుల్‌లో..



అల్లాపూర్‌లో నిర్వహిస్తున్న చెరువుల పండుగలో గ్రామస్తులు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఊరూరా చెరువు పండుగను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ, బోనాలను అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం చెరువు గట్లపై ఆడి పాడి అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. తాడ్వాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కొండి రవి, వైస్ ఎంపీపీ నర్సింలు, జెడ్పీటీసీ రమాదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కామారెడ్డి మండలం రాఘవపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, సర్పంచ్ కదిర సాగర్ గౌడ్, ప్రత్యేకాధికారి ఆదిత్య రెడ్డి, రాజంపేట మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ టి.శాంత, ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో రఘురాం, లింగంపేటలో ఎంపీడీవో మల్లికార్జునరెడ్డి, దోమకొండలో ఎంపీపీ శారద, తహసీల్దార్ కౌశిక్‌రెడ్డి, ఎంపీడీవో చిన్నారెడ్డి, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, పిట్లంలో జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదర్ శోభ, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుజాత, తహసీల్దార్ రాంమోహన్‌రావ్, ఎంపీడీవో వేంకటేశ్వర్లు, ఏపీవో శివకుమార్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వాసరి రమేష్, కామారెడ్డిలో మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే చెరువుల అభివృద్ధి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

బీబీపేట: బీఆర్ఎస్ హయాంలోనే గ్రామంలో ఉన్నటువంటి చెరువులు అభివృద్ధి అయ్యాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం బీబీపేటలో నిర్వహించిన ఊరూర చెరువుల పండుగ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా బోనాలు, బతుకమ్మలతో పెద్ద చెరువు కట్ట వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయ అదనపు గదుల నిర్మాణానికి, చెరువు కట్ట వద్ద ఆలయం నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్లలో బీబీపేట పెద్ద చెరువును నీటితో నింపి రెండు పంటలు తీసేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. బీబీపేట పెద్దమ్మ ఆలయం వద్ద నుంచి నాలుగు లైన్ల రోడ్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ ప్రేమ్ కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ ఇంద్రసేనా రెడ్డి, సర్పంచ్ తేలు లక్ష్మి, ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ పాల్గొన్నారు.



మౌలాన్‌ఖేడ్‌లో..



తాడ్వాయి: బ్రాహ్మణపల్లిలో..



లింగంపల్లిలో..



దోమకొండలో పాల్గొన్న జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్



లింగంపేటలో బతుకమ్మను ఎత్తుకున్న ఎంపీడీవో



మద్నూర్‌లో బతుకమ్మ, బోనాలతో..



రాఘవపూర్‌లో..



రాజంపేటలో..



దోమకొండలో బోనాలతో ఎంపీపీ శారద, సర్పంచ్ అంజలి

విద్యా వలంటీర్లను నియమించాలి

కామారెడ్డి అర్బన్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసే వరకు తక్షణమే విద్యా వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాఠశాల్లో చదివే పేద విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.పర్వతరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కామారెడ్డిలో నిర్వహించిన ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగంలో అనేక సమస్యలున్నా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరిణి అవలంభిస్తుని ఆరోపించారు. జూలై నాటికి కొత్త పీఆర్‌సీ కమిటీని నియమించాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర హెడ్‌క్వార్టర్ కార్యదర్శి పోల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఘనంగా దఫేదార్ రాజు జన్మదిన వేడుకలు



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

నిజాంసాగర్: మండలంలోని మహమ్మద్‌నగర్, నర్వ, గున్కుల్, సింగితం, ముగ్దుంపూర్, తున్కిపల్లి, కొమలంచ, బూర్గుల్,హసన్‌పల్లి గ్రామ పంచాయతీల్లో గురువారం ఉమ్మడి జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గున్కుల్ సొసైటీ చైర్మ న్ వాజిద్ అలీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి రక్తదానం చేశారు. సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, సర్పంచులు లక్ష్మీనారాయణ, సంగమేశ్వర్‌గౌడ్, చెందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంబరాలకు సిద్ధం



సభాస్థలిని పరిశీలన చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో గల బొమ్మన్‌దేవ్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగే సంక్షేమ సంబరాలు నిర్వహించనున్న సభా ప్రాంగాన్ని ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పరిశీలించారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ విఠల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, నాయకులు మల్లేష్, మైశాగౌడ్, ప్రతాప్ పాల్గొన్నారు.

శివాజీ అడుగు జాడల్లో నడవాలి

- విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సింధే, ఎంపీ బీబీ పాటిల్



శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్: ప్రతి ఒక్కరు ఛత్రపతి శివాజీ మహారాజ్ అడుగు జాడల్లో నడవాలని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. మండలంలోని తడిహిప్పర్గాలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. శివాజీ వీరత్వాన్ని, ధైర్యం, పట్టుదలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు గంగరాం, అరుణతార తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

మద్నూర్: మండల కేంద్రంలోని గ్రంథలయానికి గురువారం మద్నూర్‌కు చెందిన ప్రభుత్వ టీచర్ రుద్రాంగి రమేశ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పుస్తకాలను అందజేశారు. పోటీ పరీక్షల కోసం చదువుకునే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వెల్లడించారు. సర్పంచ్ సురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్సీపటేల్, నాయకులు విఠల్, కుషాల్, నాగేశ్, హన్మండ్లు, ప్రభు పాల్గొన్నారు.

సాగులోకి పడావు భూములు

బిచ్కుంద: చెరువుల మరమ్మతులు, పూడికతీత పనులతో పడావుగా మారిన భూములు సాగులోకి వచ్చాయని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. గురువారం బండారెంజల్ ఊరు చెరువుల పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. చెరువు కట్ట వద్ద గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల కాలంలో చెరువులో మట్టి కూరుకుపోయి నీళ్లు లేకపోవడంతో భూములు పడావుగా మారాయని అన్నారు. ఎంపీపీ అశోక్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, సొసైటీ చైర్మన్ రాంరెడ్డి, లడ్డుమియా, వెంకట్‌రావు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

భిక్కనూరు: జాగ్రత్తలు తీసుకుంటే హెచ్ఐవీ, ఎయిడ్స్ దరి చేరదని భిక్కనూరు పీహెచ్‌సీ వైద్యురాలు యెమిమా అన్నారు. గురువారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ తున్కి వేణు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పై అవగాహన కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈవో సదాశివ్, ఉప సర్పంచ్ బోడ నరేశ్, ఎంపీటీసీ సువర్ణ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

భిక్కనూరు: యూనివర్శిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ 9న హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు కాంట్రాక్టు టీచర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా వెల్లడించారు. ఈ మేరకు తెయూ సౌత్ క్యాంపస్‌లో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న 1,300 మంది కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు సునీత, నరసయ్య, రమాదేవి, శ్రీకాంత్, నిరంజన్, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకే చెరువుల అభివృద్ధి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : కాకతీయుల కాలంలో తవ్విన చెరువులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాకే చెరువులను అభివృద్ధి చేశామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కల్కి చెరువు కట్టపై ఊరురా చెరువుల పండగను నిర్వహించారు. మహిళలు పాత బాన్సువాడ చావిడి నుంచి బోనాలు, బతుకమ్మలతో ర్యాలీగా వచ్చారు. కల్కి చెరువు కట్టపై బతుకమ్మ ఆటాలాడారు. మహిళలతో పాటు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ సతీమణి పుష్పమ్మ బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రూ.6.50 కోట్లతో కల్కి చెరువును అభివృద్ధి చేశామన్నారు. మిషన్ భగీరథతో పాటు అమృత్ స్కీం కింద బాన్సువాడ పట్టణవాసులకు శాశ్వత తాగునీటి అవసరాల కోసం రూ. 52 కోట్లు మంజురైనట్లు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, నాయకులు కృష్ణ రెడ్డి, ఎజాస్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో బతుకమ్మ ఆడుతున్న స్పీకర్

బీసీ బంధు ప్రకటించాలి

కామారెడ్డి అర్బన్: బీసీలకు కంటి తుడుపుగా సహాయం కాకుండా దళిత బంధు మాదిరిగా బీసీల కోసం బీసీ బంధు ప్రకటించి రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆర్అండ్ బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 136 బీసీ కులాలు ఉంటే 15 కుల వృత్తుల వారికి మాత్రమే రూ. లక్ష చొప్పున సహాయం అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం సిగ్గుచేటు అన్నారు. జిల్లాలో 14 వేల మంది నిరుద్యోగ బీసీలు స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందించాలని బీసీ కార్పోరేషన్‌కు దరఖాస్తు చేసుకొని ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా, మండల, పట్టణ ప్రతినిధులు మోహనచారి, హాజీ అబ్దుల్, మజీద్, మహేష్‌కుమార్, కిషన్, సురేష్‌కుమార్, శ్యాంసుందర్, భరత్, నర్సింలు, రవికుమార్, సురేష్, రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివరాములు

ఆధ్యాత్మికం

- అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పిట్లం: మండలంలోని చిన్నకొడప్‌గల్‌లో నిర్మించిన ఆలయంలో గురువారం ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కుర్లా గ్రామంలో..



మద్నూర్: డోంగ్లీ మండలంలోని కుర్లాలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. ఆలయంలో ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమం, గణపతి పూజ, అఖండ దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సంక్షిప్తం

ఉచితంగా సేంద్రియ పండ్ల విత్తనాలు

కామారెడ్డి అర్బన్: సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, పండ్ల విత్తనాలను అవసరమైన వారికి ఉచితంగా పంపిణీ చేస్తామని సేంద్రియ వ్యవసాయ రైతు సురభి శ్రీధరశర్మ తెలిపారు. వివరాలకు 8885445486 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా మృగశిర కార్తె

కామారెడ్డి రూరల్/బాన్సువాడ రూరల్: కామారెడ్డి, బాన్సువాడ మండలాల్లో ని పలు గ్రామాల్లో మృగశిర కార్తె సందర్భంగా గురువారం చెరువుల వద్ద చేపలను కొనుగోలు చేసి వండుకుని తినడం ఆనవాయితీగా వస్తోంది. చెరువు నుండి చేపలు ఖాళీ అయితే తిరిగి పెద్ద సంఖ్యలో చేపలు చెరువులో చేరుతాయని ప్రజల నమ్మకం.

సమస్యలపై చర్చ

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని విద్య, ఉపాధ్యాయ సమస్యలపై హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించినట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.దామోదర్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులకు బదిలీలతో కూడిన ప్రమోషన్లు, సీపీఎస్ రద్దు తదితర అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు.

45వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్‌లో నిర్వహిస్తున్న నిరసన దీక్షలు గురువారం నాటికి 45 రోజుకు చేరుకున్నాయి.

ఆత్మ కమిటీ చైర్మన్‌కు మాతృవియోగం

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ పెద్దబచ్చగారి నర్సింహారెడ్డికి గురువారం మాతృవియోగం కలిగింది. స్వాతంత్ర సమరయోధుడు బాగిరెడ్డి సతీమణి అన్నపూర్ణమ్మ (88) అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం భిక్కనూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నపూర్ణమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

హెల్మెట్ ధరించాలి

ఎల్లారెడ్డి: రాంగ్ రూట్‌లో వాహనాలను నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్సై గణేష్ సూచించారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలో వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన కుర్మ కృష్ణ అదృశ్యమైనట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఈనెల 5న ఆయన భార్యతో గొడవ పడి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కృష్ణ మామ మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యూనిఫాం పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్: ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాం, పాఠ్యపుస్తకాలను ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్ గురువారం ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు

దోమకొండ: కల్తీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఎల్లారెడ్డి ఏడీఏ రత్న, ఏవో అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని విత్తనాలు దుకాణాలను తనిఖీ చేశారు.